అప్‌గ్రేడ్ సాకారమయ్యేనా..?

గ్రామస్తుల సహకారంతో విశాలమైన స్థలంలో నిర్మించిన పాఠశాల దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారి ఉన్నతికి దోహదపడింది. కానీ, విద్యార్థులు, తలితండ్రులు, గ్రామపెద్దల ఆదరణ, ప్రోత్సాహం ఉన్నా ఆ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలన్న దరఖాస్తు ఏడేళ్లుగా విద్యాశాఖ కమిషనరేట్‌లోనే మూలుగుతోంది. ఇది మండలంలోని మారుమూల ప్రాంతానికి చెందిన మాణిక్యారం ప్రభుత్వ పాఠశాల దీనావస్థ. ఈ కారణంగా నేడు పలువురు విద్యార్థులు హైస్కూల్ చదువులకు దూరమై పొలం పనులకు వెళ్తున్నారు.

- 8వ తరగతికే పరిమితమైన మాణిక్యారం పాఠశాల
- ఫలించని గ్రామపెద్దలు, ఉపాధ్యాయుల ప్రయత్నం
- హైస్కూల్ చదువుకు దూరమవుతున్న బాలికలు



అప్‌గ్రేడ్ చేయాల్సిన మాణిక్యారం ప్రాథమికోన్నత పాఠశాల

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామంలో గ్రామపెద్దల సహకారం, పట్టుదలతో దశాబ్దాల క్రితం ప్రాథమిక పాఠశాల మంజూరైంది. గ్రామపెద్దల తోడ్పాటు, తల్లిదండ్రుల ఆదరణ, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థులు చదువు పట్ల చూపిన శ్రద్ధతో పాఠశాల విజయవంతంగా కొనసాగింది. ఆదర్శ పాఠశాలగా పేరు సంపాందించుకుంది. కాలక్రమంలో ఇతర పాఠశాలల మాదిరిగా 5వ తరగతి నుంచి ఒక్కో తరగతి పెరుగుతూ ఎనిమిదో తరగతి వరకు అప్‌గ్రేడ్ అయింది. ఆ తరువాత పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని గ్రామపెద్దలు తీవ్రంగా కృషి చేశారు. కనిపించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు వినతిపత్రాలు అందించారు. చివరకు జిల్లా విద్యాశాఖ సహకారంతో అప్‌గ్రేడ్ దరఖాస్తును 2018, ఆగస్టు 30న విద్యాశాఖ కమిషనరేట్‌లో అందజేశారు. ఆ తరువాత ఏం జరిగిందో కానీ నేటికీ అప్‌గ్రేడ్‌కు సంబంధించి అనుమతులు మంజూరు కాలేదు.

హైస్కూల్ చదువులకు తప్పని దూరభారం...

ఇల్లెందు ఏజెన్సీలో కొమరారం మినహా ఏ ఒక్క గ్రామపంచాయతీలోనూ ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కాలేదు. దీంతో ఏజెన్సీ విద్యార్థులకు కొమరారం ఒక్కటే దిక్కైంది. ఈ కారణంగా విద్యార్థులు ప్రతీరోజు పది కిలోమీటర్ల దూరం సైకిళ్లపై పాఠశాల చేరుకుంటూ చదువుకుంటున్నారు. ఇక పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించిన సమయంలో విద్యార్థుల అవస్థలు చెప్పనలవి కాదు. బాలికలకైతే బడికెళ్లడమే కష్టంగా మారుతోంది. కొంతమంది తండ్రులు తమ కూమార్తెలను ఉదయం, సాయంత్రం సైకిల్‌పై బడికి చేర్చడం, తీసుకెళ్లడం తప్పని పరిస్థితిగా మారింది.

పెరుగుతున్న డ్రాప్‌అవుట్స్...

పది కిలోమీటర్ల దూరం ప్రయాణించడం భారంగా మారిన విద్యార్థులు ప్రాథమిక స్థాయితోనే చదువులకు స్వస్తి చెబుతున్నారు. మాణిక్యారం గ్రామంలో ఎనిమిదో తరగతి వరకు చదువుకొని తొమ్మిదో తరగతికి కొమరారం వెళ్లలేక డ్రాప్‌అవుట్‌గా ఉండిపోయిన నందిని, సాయివర్ధన్ అనే విద్యార్థులను బడిబాట కార్యక్రమంలో గుర్తించిన మాణిక్యారం ఉపాధ్యాయులు వారికి నచ్చజెప్పి పదో తరగతిలో చేర్పించారు. మార్చిలో వచ్చిన ఫలితాలలో వారు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో నందిని అనే విద్యార్థినిని ఆమె తండ్రి సారయ్య ప్రతీరోజు సైకిల్‌పై ఎక్కించుకొని పాఠశాలకు చేర్చేవాడు. అయితే సైకిల్‌పై ఒక్కరినే తీసుకెళ్లే అవకాశం ఉండటంతో సారయ్య తన రెండో కుమార్తె హాసినిని బడికి దూరం చేయక తప్పలేదు. హాసిని లాంటి విద్యార్థినులు అనేక మంది ఏజెన్సీ గ్రామాలలో హైస్కూల్ చదువులకు దూరమవుతున్నారు.

పెద్దలు స్పందించాలి...

తొమ్మిది గ్రామపంచాయతీలను కలుపుకొని ఉన్న ఇల్లెందు ఏజెన్సీలో కొమరారం కేంద్రంగా మాత్రమే హైస్కూల్ కొనసాగుతోంది. హైస్కూల్ చదువు అందించేందుకు పెండింగ్‌లో ఉన్న మాణిక్యారం పాఠశాల అప్‌గ్రేడ్ దరఖాస్తును తక్షణమే పరిష్కరించి మిగతా పాఠశాలల అప్‌గ్రేడ్ అవకాశాలను పరిశీలిస్తే మరింత మంది విద్యార్థులు హైస్కూల్ చదువులు చదివే అవకాశం ఉంటుంది.

చదువుకు దూరమయ్యా..



మా ఇంట్లో నేను మా అక్క. మాకు సైకిల్ తొక్కడం రాదు. తొమ్మిదో తరగతిలో ఇద్దరం బడికి పోలేదు. సార్లు వచ్చి మా అక్క నందినిని పదో తరగతిలో చేర్పించారు. మా నాన్న ప్రతీరోజు సైకిల్‌పై తీసుకెళ్లేవాడు. ఇద్దరం వెళ్లే పరిస్థితి లేక నేను చదువు మానేశాను. ప్రస్తుతం పొలం పనులకు వెళ్తున్నా.

– పూనెం హాసిని, బడిబయట ఉన్న విద్యార్థిని, మాణిక్యారం

అప్‌గ్రేడ్ కోసం దరఖాస్తు చేశాం..



మాణిక్యారం యూపీఎస్ పాఠశాల అప్‌గ్రేడ్ కోసం జిల్లా విద్యాశాఖ అనుమతితో 2018లో విద్యాశాఖ కమిషనరేట్‌లో దరఖాస్తు చేశాం. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. కానీ నేటికీ అనుమతి రాలేదు. హైస్కూల్ లేక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యపై ప్రభావం చూపుతోంది.

– పూనెం రమేష్, ప్రధానోపాధ్యాయులు, మాణిక్యారం

ఉన్నతాధికారులు స్పందించాలి..



మాణిక్యారం గ్రామ పాఠశాల అప్‌గ్రేడ్ కోసం గతంలో విద్యాశాఖ ఉన్నతాధికారులను, మంత్రులను గ్రామపెద్దలమంతా కలిసి విన్నవించాం. జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాకు హామీ ఇచ్చారు. కానీ ఏడేళ్లు గడిచినా అనుమతులు రాలేదు. ఉన్నతాధికారులు స్పందించి అప్‌గ్రేడ్ చేసి ఏజెన్సీ గ్రామాలలో డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలి.

– మోకాళ్ల కృష్ణ, మాజీ సర్పంచ్, మాణిక్యారం

మున్సిపాలిటీలో పనితీరు అధ్వానం



మాట్లాడుతున్న చైర్మన్ డీవీ, పక్కన కమిషనర్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఇల్లెందు: ఆరు నెలలుగా అధికారుల పని తీరు అధ్వానంగా మారింది. డంప్ యార్డులో కంపోస్టు యూనిట్ పని చేయటం లేదు.. పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగటం లేదు.. రోడ్ల మీద చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి.. చెత్త సేకరణ వాహనలు మూలన పడ్డాయి. రోడ్ల వెంట కాలువలు పేరుకుపోతున్నాయి. చెత్తచెదారంతో రోడ్ల వెంట దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడే ప్రమాదం ఉంది. శానిటేషన్ యంత్రాంగం వారం రోజుల్లో పని తీరు స్పష్టంగా మెరుగు అవ్వాల్సిందే, విధులకు రానివారిని తక్షణం తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించండి అని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని పని తీరును మెరుగుపర్చుకోవాలని కోరారు. ఫాగింగ్ చేపట్టాలని, వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న వారు పైపులైన్లలో లీకులు లేకుండా పట్టణ ప్రజలకు నీరు అందించాలని సూచించారు. భగీరథ ద్వారా నీరందించాలని సూచించారు. అన్ని ట్యాంకులకు నీరు ఎక్కించి ప్రతీ ట్యాప్ ద్వారా నీరు విడుదలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇంటింటి ట్యాక్స్, పంపు బిల్లులు సకాలంలో వసూలు చేయాలని, టెండర్ పిలిచి షాపులను కేటాయించాలని సూచించారు. పట్టణంలో ఆక్రమణలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ వార్డుకు సరిపడా బ్లీచింగ్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రధాన రహదారి వెంట ట్రాఫిక్ సమస్యపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ బి.యాదగిరి, డీఈ నవీన్, ఏఈ కుమారస్వామి, ఏఓ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, టీపీఓ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అజిత్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయ సిబ్బంది శ్రావణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. పాల్వంచలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడమే గాక స్టేషనరీ తమ దగ్గర లేకుంటే తాము సిఫార్స్ చేసిన వారి వద్దే కొనాలని షరతులు పెడుతున్నారని ఆరోపించారు. పాఠశాలలు పునఃప్రారంభం అయినందున ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అధికారులు స్పందించిక పోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల సృజన్, వెంకటేశ్, చందులాల్, రాజు, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి



కొత్తగూడెంరూరల్: విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న పద్మ



ఇల్లెందురూరల్: యూనిఫాం, బుక్స్ అందజేస్తున్న ఎంపీపీ నాగరత్నమ్మ

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు, శ్రీనగర్ ఎంపీటీసీ కొల్లు పద్మ అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో పిల్లలకు యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం వడ్డించి చిన్నారులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం జ్యోతిరాణి, ఉపాధ్యాయులు తబస్సుమ్, రుబీన, ఇన్నయ్య, జానకి, స్వప్న, మంగ, హసీనా, ఆఫ్రీన్, రూతమ్మ, కల్యాణి, రాధిక ,శ్రవంతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులంతా ఉన్నతంగా ఎదగాలని ఎంపీపీ చీమల నాగరత్నమ్మ ఆకాంక్షించారు. మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ హనుమంతులపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం గురువారం పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. హనుమంతులపాడు ప్రాథమిక పాఠశాల మరమ్మతుల అనంతరం కార్పొరేట్ పాఠశాలలకు మిన్నగా కనిపిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు సుజాత, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం..

ఇల్లెందు: శాంతిభద్రతల పరిరక్షణే తన లక్ష్యం, పట్టణ ప్రజలు, రాజకీయ పక్షాలు, వ్యాపారులు, ఉద్యోగులు సహకరించాలని ఇల్లెందు సీఐ బి.సత్యనారాయణ కోరారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు పోలీస్ స్టేషన్‌లలో పని చేసిన అనుభవం ఉందని ఇల్లెందులో ప్రజల సహ కారంతో ముందుకు సాగుతానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉధృతం చేస్తానని తెలిపారు. పోలీసుల పని తీరుపై కూడా పరిశీలన ఉంటుందన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం



కొత్వాలను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

పాల్వంచ: ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లా సహకార మార్కెటింగ్ (డీసీఎంఎస్) చైర్మన్‌గా ఎన్నిక కావడం పట్ల కొత్వాల శ్రీనివాసరావును రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సన్మానించారు. గురువారం గండుగులపల్లిలోని తుమ్మల నివాసంలో కొత్వాల శ్రీనివాసరావు మంత్రి తుమ్మలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులకు మరింత సేవ చేయాలని సూచించారు. యర్రంశెట్టి ముత్తయ్య, మండల అధ్యక్షుడు కొండం వెంకన్న, వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే కీలకం

జూలూరుపాడు: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంక్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గురువారం ప్రారంభించారు. జూలూరుపాడుకు చెందిన సాయిల కృష్ణయ్య ఈ బంక్‌ను ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందిస్తూ మెరుగైన సేవలందించాలని సూచించారు. సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు మధుసూదన్‌రావు, మాలోత్ మంగీలాల్ నాయక్, యల్లంకి చిన్ననాగేశ్వరరావు, నర్వేనేని పుల్లారావు, రోకటి సురేష్, సాయిల కృష్ణయ్య పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు – కల్పన దంపతులను అంబేడ్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ ఆధ్వర్యాన గురువారం సన్మానించారు. మాట్లాడుతూ.. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరయ్యాక ప్రిన్సిపాల్ నేతృత్వాన మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో మెరుగైన సేవలందుతున్నాయని తెలిపారు.

సంత వేలం రద్దు

టేకులపల్లి: మద్దతు ధర రాకపోవడంతో టేకులపల్లి వారపు సంత వేలంపాటను రద్దు చేశారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ గణేష్ గాంధీ అధ్యక్షతన టేకులపల్లి, గోలియాతండా గ్రామ పంచాయతీల సంయుక్త వారపు సంతకు 2024–25 సంవత్సరానికి గాను వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో ఆరుగురు ముందస్తుగా రూ.50వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పాట రూ.6.88 లక్షల వద్ద నిలిచిపోయింది. ఎంతకీ ముందుకు సాగలేదు. గత సంవత్సరంలో రూ.11.81లక్షలకు సంతను పాడుకున్నారు. మద్దతు ధర రాకపోవడంతో వేలంపాటను రద్దు చేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

ఆశా కార్యకర్తల ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని, 33 సంవత్సరాల అనుభవానికి మించి చదువు ఉంటుందా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రూన్సీ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడారు. జి.పద్మ, ధనలక్ష్మి, దొడ్డ రవికుమార్, కె.సత్య, భూక్యా రమేష్, సుశీల, హేమ, విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పాల్వంచ: ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పాత పాల్వంచ వద్ద పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. డ్రైవర్ బి.నర్సింహారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.రాము తెలిపారు.

కార్మికవాడలపై కనికరం చూపండి..

ఇల్లెందు: సింగరేణి కార్మికవాడల్లో సమస్యలను పరిష్కరించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌ను కోరారు. గురువారం ఇల్లెందులో జీఎంను కలిసి సమస్యలను వివరించారు. నీటి సరఫరా లేదని, కరెంటు కోతలు విధిస్తున్నారని, కోతుల బెడద తీవ్రంగా ఉందని విన్నవించారు. కార్మికవాడల్లో ఫాగింగ్ నిర్వహించటం లేదని, బ్లీచింగ్ చల్లించటం లేదన్నారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్లకు మరమ్మతులు చేయాలని విన్నవిస్తే చూస్తాం.. చేస్తాం.. అంటూ సమాధానాలతో దాటవేస్తున్నారని తెలిపారు. స్పందించిన జీఎం సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచి, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రోడ్లు, కాలువల పనులు చేపట్టకుండా వదిలేశారని, ఆ పనులను చేపట్టాలని కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి సీపీఐ కౌన్సిలర్ల బృందం ఏరియా జీఎం శాలేంరాజును కోరారు. గురువారం ఆయన చాంబర్‌లో కలిసి సమస్యలకు వివరించారు. టెండర్లు పిలిచి రూ.30 లక్షలను కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారని వారు పనులు చేయటం లేదని ఫలితంగా డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నట్లు చెప్పారు. కంచర్ల జమలయ్య, మునిగడప పద్మ, భూక్యా శ్రీనివాస్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

18న ఇంటర్వ్యూ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో జూవాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు 2024–25 విద్యా సంవత్సరానికి భర్తీ చేయుటకు ఈనెల 18న డెమో – కమ్ – ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం (జూనియర్ కళాశాల విభాగం) నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రకటన గురువారం విడుదల చేసింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో కనీసం 55శాతం మార్కులు ఉండాలని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా సింగరేణి మహిళా జూనియర్ కళాశాలకు తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..



కేటీసీలో ఎల్ఎస్ఎన్ కార్మికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: కేటీసీలో ఎల్ఎస్ఎన్ఓబీలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, హెల్పర్స్, ఆపరేటర్లు, బ్లాస్టింగ్ మరియు వివిధ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికుల సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులకు పదో తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని, 8 గంటల పనిని అమలు చేయాలని కోరారు. 12 గంటల పనులు చేయిస్తుండటం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గతంలో ఆందోళన నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఈ ఆందోళన ఫలితంగా 12 గంటల పని స్థానంలో టైర్ సెక్షన్ వివిధ విభాగాల కార్మికులకు ఎనిమిది గంటల పని వర్తింపజేస్తున్నారని, మిగతా సమస్యలు అలానే ఉన్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డ్రైవర్లకు వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని మరియు సేఫ్టీ రూల్స్ అమలు చేయాలని, కండిషన్‌లో ఉన్న వాహనాలు నడపాలని, పెట్రోల్ అలవెన్స్ పెంచాలని, బ్లాస్టింగ్ కార్మికులకు బెల్లం, రెడ్ టీ షర్ట్స్ ఇవ్వాలని కోరారు. ఎల్ఎస్ఎన్ నిర్వాహకులకు, సింగరేణి అధికారులకు పలుమార్లు కార్మికుల సమస్యలపై తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీరన్న, లక్ష్మయ్య, శ్రీను, చారి, రాందాస్, నవీన్, అనిల్, సాగర్, ఆరిఫ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇల్లెందురూరల్: విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వాసవీరాణి అన్నారు. మండలంలోని పలు పురుగుమందులు విత్తనాల దుకాణాల్లో గురువారం ఆమె తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. రోజువారీగా రిజిష్టర్లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మాట్లాడుతూ.. రైతులు ఒకే రకం విత్తనాల కోసం ఎదురుచూడడం సరైంది కాదన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

చుంచుపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెనగడప 3 ఇంక్లైన్ సబ్ సెంటర్ పరిధిలో డెంగీ కేసు నమోదు కావడంతో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అదే గ్రామానికి చెందిన నెమలికల్ల ఈశ్వరి డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. స్పందించిన వైద్యసిబ్బంది గురువారం డాక్టర్ నేహా అంబ్రిన్ ఆధ్వర్యంలో 3 ఇంక్లైన్ గ్రామంలో హెల్త్ క్యాంపును నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఈ క్యాంపులో సీహెచ్ఓ సువర్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.పూర్ణారావు, ఎస్.సుశీల, ప్రియదర్శిని, ఆరోగ్య కార్యకర్తలు బి.సాలి, కె.సుజాత, ఆశా కార్యకర్తలు, పి.కవిత, ఎం.మల్లిక, ఎల్‌టీ.ప్రణీత్ పాల్గొన్నారు.

హర్షం..

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరు చేయడంపై టీడీపీ, సీపీఐ నాయకులు కనగాల అనంతరాములు, ముత్యాల విశ్వనాథం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ సోమరాజు దొర, జరబన సాంబశివరావు, చంద్ర రవి, బెల్లంకొండ బాబూరావు, సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాల్లో అందని వైద్యం

- డాక్టర్లు, వైద్యసిబ్బంది పోస్టులు ఖాళీ
- ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షే..



బేతాళపాడు పల్లె దవాఖానా

జూలూరుపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె దవాఖానాలకు శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 2021లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే ప్రజలు వైద్యం పొందడానికి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాలకు వెళ్లే పరిస్థితి లేకుండానే హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 240 హెల్త్ సబ్ సెంటర్లు ఉండగా 132 హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) పరిధిలో 9 హెల్త్ సబ్ సెంటర్లు ఉండగా, ఇందులో కొమ్ముగూడెం, బేతాళపాడు, అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చారు. అయితే కొమ్ముగూడెం పల్లె దవాఖానాకు మాత్రమే ఎంబీబీఎస్ డాక్టర్‌ను నియమించగా రెండేళ్ల క్రితమే డాక్టర్ డిప్యూటేషన్‌పై రామవరం(అర్బన్) ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వెళ్లారు. బేతాళపాడు, అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చిన నాటి నుంచి డాక్టర్ల నియామకం జరగలేదు. 2023లో అన్నారుపాడు పల్లె దవాఖానా డాక్టర్లను డిప్యూటేషన్‌పై డీఎంహెచ్ఓ కార్యాలయానికి వెళ్లగా బేతాళపాడులో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టు భర్తీ చేసి, డాక్టర్‌ను నియమించకుండానే జిల్లా ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. మొదటి దశలో కొమ్ముగూడెం, బేతాళపాడు, అన్నారుపాడు హెల్త్ సబ్ సెంటర్లు పల్లె దవాఖానాలుగా మారినప్పటికీ డాక్టర్లు లేకపోవడంతో సుమారు 25 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రాకుండా పోయాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందని ద్రాక్షగానే మిగిలింది. హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా పేరు మారిందే తప్ప ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదు. నాలుగేళ్ల క్రితం హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చిన విషయం స్థానిక ప్రజలకు తెలియకపోవడం విశేషం. డాక్టర్లు లేకుండా హెల్త్ సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చినా ప్రయోజనం ఏమిటని పలువురు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పల్లె దవాఖానాల్లో డాక్టర్ల నియామకాల ప్రక్రియ కాంట్రాక్ట్ పద్ధతిలో నెలకు రూ.40 వేల వేతనంతో ప్రభుత్వం చేపడుతున్నా పల్లె దవాఖానాల్లో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అన్నారుపాడు పల్లె దవాఖానాలో వైద్యసిబ్బంది

పేరు మార్చిన విషయం తెలియదు..



హెల్త్ సబ్ సెంటర్‌ను పల్లె దవాఖానగా మార్చారనే విషయం తెలియదు. హెల్త్ సబ్ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వైద్యసేవలు అందిస్తున్నారే తప్ప డాక్టర్ రావడం లేదు. పేరు మార్చడం కాదు. వైద్యసేవలు అందించాలి.

– పోగుల నాగభూషణం, బేతాళపాడు

మెరుగైన వైద్యం అందించాలి



అన్నారుపాడులో పల్లె దవాఖానా ఏర్పాటు చేయడం చాలా మంచిది. అన్ని సౌకర్యాలతోపాటు, డాక్టర్‌ను నియమించి మెరుగైన వైద్యం అందించాలి. డాక్టర్ లేకపోవడంతో ఏ చిన్న రోగానికైనా జూలూరుపాడు, పాపకొల్లు, కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది.

– మల్కం సుశీల, గుండ్లరేవు

పల్లె దవాఖానాల్లో వైద్యులు లేరు



పల్లె దవాఖానాల్లో ప్రస్తుతం వైద్యులు లేరు. డిప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్లు త్వరలోనే తిరిగి విధుల్లో చేరతారు. ప్రస్తుతం పల్లె దవాఖానాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వైద్యసేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు